క్లుప్తంగా

శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ఆదోనిఅర్బన్ : పట్టణశి వారులోని రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనే యస్వామి ఆలయంలో గురువారం శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున ఆలయ నిర్వాహకుడు టీజీ పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీ, పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళాలు


దాతకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి గురువారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ మాట్లాడుతూ..కర్ణాటకలోని రాయచూర్ పట్టణానికి చెందిన కుంటనహాల్ విజయ్‌కుమార్, కుటుంబ సభ్యులు రూ.1,00,100, కర్నూలుకు చెందిన ఈ.రామచంద్రగౌడ్ కుటుంబ సభ్యులు రూ.1,01,121, తెలంగాణ రాష్ట్రం వనపర్తికి చెందిన డాక్టర్ కె. నరేష్‌కుమార్, కుటుంబ సభ్యులు రూ. 1,00,016 అందజేశారని తెలిపారు. వారికి స్వామి వారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, బాండ్ అందజేసినట్లు చెప్పారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు


రోడ్డును పరిశీలిస్తున్న డీఈ ఖాదర్ బాషా

ఆదోని సెంట్రల్: మండలంలోని కె.నాగాలపురం గ్రామ రహదారి నిర్మాణానికి రూ.56 లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మిగనూర్ రహదారి నుంచి నాగలాపురం గ్రామానికి ఒక కిలోమీటరు దూరం ఉంటుంది. కిలో మీటరు బీటీ రహదారి నిర్మించనున్నారు. గతంలో నిర్మించిన రోడ్డు శిథిలమై పోయింది. ప్రస్తుతం గుంతలమయమైన రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులు సమస్యను ఎమ్మెల్యే సాయప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. పనులు త్వరలో ప్రారంభిస్తామని డీఈ ఖాదర్ బాషా గురువారం తెలిపారు.

జింకల నుంచి పంటలను కాపాడండి


పొలంలో పంట పొలంలో జింకలు

ఆదోని సెంట్రల్: మండలంలో జింకల బెడద నుంచి పంటలను కాపాడాలని పలువురు రైతులు కోరారు. ఆలూరు రోడ్డులో ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు పత్తి, మిరప, జొన్న తదితర పంటలు సాగు చేశారు. మొలక దశలో ఉన్నప్పుడే జింకలు తినడంతో పైరు వృద్ధిలోకి రావడం లేదని రైతులు వాపోతున్నారు. వర్షాలు సరిగా పడక వేసిన పంటలు చేతికి వస్తుందో రాదో తెలియక అయోమయ పరిస్థితిలో జింకల బెడద మరింత దెబ్బతీస్తుందని రైతులు రామయ్య,ఈరన్న, బాషా గురువారం వాపోయారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతి చెందిన చిన్న రాముడు

కోసిగి: మండలంలోని చిన్నభూంపల్లి గ్రామానికి చెందిన కొలిమి చిన్న రాముడు (52) అనే రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. రాముడు తనకున్న మూడె కరాలతో పాటు మరో 3 ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగుచేస్తున్నాడు. కౌలుకు తీసుకున్న పొలంలో పత్తి, మిరప పంటలు సాగు చేశాడు. పైర్లకు నీటి తడులు పెట్టేందుకు గురువారం విద్యుత్ మోటార్ స్టాటర్ వద్ద స్విచ్ వేసి ఆన్ చేసే క్రమంలో షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టు పక్కల రైతులు వచ్చి చూసే సరికి శరీరం కొంత భాగం కాలి పోయింది. మృతుడికి భార్య నరసింగమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్ కో ఏఈ వీరేష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు.

పత్తికొండలో నేడు జాబ్‌మేళా

పత్తికొండటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈనెల 18వతేదీ నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి తెలిపారు. టాటా ఆల్‌సెక్, స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాకు హాజరై నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగులు విద్యార్హతల సర్టిఫికెట్లతో నేరుగా జాబ్‌మేళాకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు

- ఆదోని డివిజన్‌లో రూ.50కోట్లతో విద్యుత్ పనులు
- రూ.2.50కోట్లతో 33/11కేవీ మినీ సబ్‌స్టేషన్ నిర్మాణం
- వంద గృహాలకు ఒక మినీ ట్రాన్స్‌ఫార్మర్
- రూ.11.93 కోట్లతో అంతర్గత రహదారులు
- తాగునీటి వసతికి రూ.7.69 కోట్లు
- ఆదోనిలో రూ.7.40 కోట్లతో ప్రత్యేక రహదారి


రహదారుల్లో మట్టిని చదును చేస్తున్న యంత్రం

ఆదోని సెంట్రల్: పేదల సొంతింటి కల నెరవేర్చడంలో భాగంగా ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చేసి, ఇళ్ల మంజూరు చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఆయా కాలనీల్లో వసతులు సైతం కల్పించింది. ఆదోని డివిజన్‌లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో విద్యుత్ స్తంభాలు పాతి తీగలు లాగారు. అలాగే కుళాయిల కోసం మినీ ట్యాంకులు, రహదారులు, బోరు, మోటారు తదితర వసతుల కల్పన పనులు జోరుగా సాగుతున్నాయి.

రూ. 50కోట్లతో పనులు..

ఆదోని డివిజన్‌లోని జగనన్న కాలనీల్లో రూ. 50 కోట్లతో విద్యుత్ పనులు కొనసాగుతున్నాయి.ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ,ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు స్తంభాలు పాతి, తీగలు లాగారు. ఆదోని పట్టణంలోని జగనన్న కాలనీలో రూ. కోటితో విద్యుత్ సౌకర్యం కల్పించే పనులు చేస్తున్నారు. కాలనీలో విద్యుత్ సమస్య తలెత్తకుండా రూ.2.50 కోట్లతో 33/11కేవీ మినీ సబ్ స్టేషన్ పనులు జరుగుతున్నాయి. సబ్ స్టేషన్ నుంచి కాలనీకి భవిష్యత్‌లో విద్యుత్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు 100 గృహాలకు ఒక మినీ 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చనున్నారు. విద్యుత్ సరఫరాలో ఒక పక్క అంతరాయం కలిగినా మరో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్తు తీసుకునేలా పనులు చేస్తున్నారు. ఈ మినీ సబ్ స్టేషన్ పూర్తయితే జగనన్న కాలనీతో పాటు చుట్టు ఉన్న గ్రామాలు డణాపురం, సాదాపురం, మండగిరి వంటి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదు.

అంతర్గత రహదారులు, తాగునీరు..

జగనన్న కాలనీలో అంతర్గత రహదారులతో పాటు తాగునీటి వసతి కల్పించే విధంగా పనులు చేస్తున్నారు.రూ.11.93 కోట్లతో అంతర్గత రహదారులను ఏర్పాటు చేస్తున్నారు. మట్టి గ్రావెల్‌తో రహదారులను పటిష్ట పరుస్తున్నారు. భవిష్యత్‌లో ప్రజలు ఇబ్బందులకు గురి కాకూడదని ప్రభుత్వం లేఅవుట్ ప్రకారం ప్రణాళిక బద్ధంగా రహదారుల నిర్మాణాలు చేపడుతున్నారు. తాగునీటి వసతి కోసం ప్రభుత్వం రూ.7.69 కోట్లు ఖర్చు చేస్తోంది. కాలనీలోని వాడ వాడలకు ఒక మినీ ట్యాంకును ఏర్పాటు చేసింది. తాగునీటి సరఫరా కోసం పైపులను కూడా అమర్చింది. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలుతో అన్ని సౌకర్యాలను కల్పించే విధంగా ప్రణాళికలను రూపొందించి పనులను చేస్తున్నారు.

బీటీ రహదారి..

ఆదోని పట్టణం నుంచి జగనన్న కాలనీ మీదుగా ధణాపురం గ్రామానికి వెళ్లేలా బీటీ రహదారి నిర్మాణ పనులను చేపటేందుకు ప్రభుత్వం రూ.7.40 కోట్లు మంజూరు చేసింది. పట్టణంలోని రైల్వేట్రాక్ నుంచి రహదారి పనులను చేపడుతున్నారు. 5.50 మీటర్ల వెడల్పుతో రహదారి పనులు సాగుతున్నాయి. రహదారి పనులు పూర్తి అయితే కాలనీ వాసులు పనుల నిమిత్తం పట్టణానికి వచ్చి వెళ్లే వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు.


విద్యుత్ స్తంభాలు పాతి తీగలు ఏర్పాటు చేసిన దృశ్యం


మినీ ట్రాన్స్‌ఫార్మర్ కోసం సిద్ధంగా ఉన్న దిమ్మె


తాగునీటి కోసం ఏర్పాటు చేసిన మినీ ట్యాంకు

కాలనీలో విద్యుత్ పనులు జరుగుతున్నాయి

ఆదోని డివిజన్‌లోని జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరా పనులు చేపడుతున్నాం. ఆదోని పట్టణంలోని జగనన్న కాలనీలో దాదపు పనులు పూర్తి కావచ్చాయి. ఈ నెల చివరినాటికి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వం అందించిన ప్రణాళికల ద్వారా పనులు చేపడుతున్నాం. కాలనీ వాసులకు భవిష్యత్‌లో విద్యు అంతరాయం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఒక వేళ అంతరాయం కలిగినా, ప్రత్యామ్నాయంగా మరో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సౌకర్యం తీసుకునేలా పనులు చేస్తున్నాం. – కృష్ణమోహన్, ఏఈ

మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం



జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలతో పాటు ప్రభుత్వం మౌలిక వసతులను కల్పిస్తోంది. అంతర్గత రహదారులతో పాటు తాగు నీరు వంటి సౌకర్యాలను కల్పించే పనులు కొనసాగుతున్నాయి. విద్యుత్ సరఫరా పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇళ్ల నిర్మాణాల్లో కూడా ఎలాంటి జాప్యం తలెత్తకుండా త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకున్నాం. ఈ మేరకు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. నిర్మాణాల దశలను బట్టి బిల్లులు మంజూరువుతున్నాయి.

– రవికుమార్, డీఈ, హౌసింగ్ కార్పొరేషన్

తప్పుల్లేని జాబితా రూపొందించేందుకు కృషి

- నూతన ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టండి
- ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్ : తప్పుల్లేని తుది ఓటరు జాబితా రూపొందించేందకు అధికారులు సమష్టిగా కృషి చేస్తున్నారని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన తుది ఓటర్ల జాబితాను జనవరి 5న ప్రచురించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని, ఇందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ సమ్మరీ రివిజన్–2024పై తహసీల్దార్ వెంకటలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనుపమ, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఇంటింటి సర్వే పకడ్బందీగా జరుగుతోందన్నారు. తహసీల్దార్, బూత్ లెవెల్ అధికారులకు ఇప్పటికే స్పెషల్ సమ్మరీ రివిజన్–2024కి సంబంధించిన శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. ఆగస్టు 21 వరకు బూత్‌లెవెల్ స్థాయి అధికారులతో ఇంటింటి ఓటర్ల పరిశీలన చేస్తారని, ఆ తర్వాత మార్పులు, చేర్పులు, తొలగింపులు చేస్తారన్నారు. బీఎల్‌ఓలతో ఇంటింటి ఓటర్ల పరిశీలన సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకొని వారు కూడా భాగస్వాములు అయ్యేలా చూడాలన్నారు. ఏజెంట్ల జాబితాను కార్యాలయంలో సమర్పించి సహకరించాలన్నారు. నూతన ఓటర్స్ కోసం స్పెషల్ డ్రైవర్‌ను నిర్వహించి 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటరు నమోదు చేయాలని చెప్పారు. నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలు, బీఎల్‌వోలు 256, ప్రస్తుతం నియోజకవర్గ ఓటర్లు 2,51,573 మంది ఉన్నారన్నారు. ఇందులో పురుష ఓటర్లు 1,26,056, మహిళా ఓటర్లు 1,25,473 మంది ఉండగా, ఇతరులు 44 మంది ఉన్నారని చెప్పారు. ఈనెల 21వ తేదీ వరకు బూత్ లెవెల్ స్థాయి అధికారులతో ఇంటింటి ఓటర్ల పరిశీలన చేయడం జరుగుతుందని, అప్పుడు గుర్తించిన మార్పులు, చేర్పులు, తొలగింపలుకు సంబంధించిన లిస్ట్ తయారు చేసి అక్టోబర్ 17న సమగ్ర ముసాయిదా జాబితా ప్రచురిస్తామన్నారు. ఆ జాబితాకు సంబంధించి దరఖాస్తులు, అభ్యంతరాలను అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు స్వీకరిస్తామని చెప్పారు. జనవరి 5న తుది జాబితా ప్రచురిస్తామని పేర్కొన్నారు. బీఎల్‌ఓలకు ఓట్లను తీసివేయడం, చేర్చే అధికారం లేదని, కేవలం ఈఆర్‌ఓలకు మాత్రమే ఉంటుందని సబ్‌కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్లను తొలగించే అంశంలో కూడా రెండు శాతం కంటే ఎక్కువ చేస్తే ప్రతి ఓటరు తొలగింపుపై ప్రధాన ఎన్నికల అధికారికి వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కోసిగి: మండల పరిధిలోని దుద్ది రిజర్వాయర్ సమీపంలో ఉన్న తాగునీటి బోర్లకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. గురువారం రిజర్వాయర్ సమీపంలో సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బందితో కలిసి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్ సరఫరా ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ బోర్ల నుంచి కోసిగిలో సిద్ధప్ప పాళెంలోని ఎస్సీ కాలనీ, దుర్గమ్మ నగర్, 1వ వార్డు, దొరల చావిడి, వడ్డే వీధి, ఊరు వాకిలి, ఎన్టీఆర్ కాలనీ వరకు నీరు సరఫరా అవుతుందన్నారు. గతంలో లోఓల్టేజ్, సక్రమంగా విద్యుత్ సరఫరా లేక పోవడంతో ఆయా కాలనీ వాసులకు నీటి సక్రంగా సరఫరా కాక ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం సమస్య పరిష్కారమైందని చెప్పారు.

రీ సర్వేతో సంపూర్ణ రక్షణ

కోసిగి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షతో రైతులకు శాశ్వత, సంపూర్ణ రక్షణ లభిస్తుందని తహసీల్దార్ రుద్రగౌడ తెలిపారు. గురువారం కోసిగి , అగసనూరు గ్రామాల్లో రైతులతో కలిసి జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకంపై గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రెండవ విడుత కింద భూములు రీసర్వే చేసేందుకు కోసిగి, అగసనూరు, ఆర్లబండ, కడదొడ్డి గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. కోసిగిలో 3,790.60 ఎకరాలు, కడదొడ్డిలో 879.32 ఎకరాలు, అగసనూరులో 2,868.79 ఎకరాలు, ఆర్లబండలో 2,252.79 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. కడదొడ్డి, ఆర్లబండలో రీసర్వే ప్రక్రియ ప్రారంభం కాగా.. కోసిగి, అగసనూరులో నేటి నుంచి రీ సర్వే ప్రారంభిస్తామని చెప్పారు. సర్వేయర్ బసవరాజు, వీఆర్వో లింగన్న, రాజేష్ ఉన్నారు.

ఘనంగా తులసీదాసు జయంతి

ఆదోనిఅర్బన్ : సమరసతా సేవా ఫౌండేషన్(ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో గురువారం సంత్ తులసీదాసు జయంతిని స్థానిక గంగాభవానీ దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర సహ నిధి ప్రముఖ్ శివరామకృష్ణయ్య, ఎస్ఎస్ఎఫ్ జిల్లా సహ కన్వీనర్ చక్రవర్తిదేశాయ్ పాల్గొని మాట్లాడారు. ప్రపంచానికి హనుమాన్‌చాలీసాను పరిచయం చేసిన మహనీయుడని కొనియాడారు. ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ నాయకులు నాగేంద్ర, ఆదోని సబ్‌డివిజన్ ధర్మ ప్రచారక్ నాయకలు నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఉపాధ్యాయులు రామయ్య,ప్రసాద్ రుచి చూసిన తరవాత విద్యార్థులకు వడ్డించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం వండి వడ్డించాలని, నాణ్యత పాటించాలని నిర్వాహకులకు సూచించారు.

టీబీ, హెచ్ఐవీపై అవగాహన

ఆదోని టౌన్: స్థానిక సబ్‌జైలు కార్యాలయంలో టీబీ, హెచ్ఐవీపై ఖైదీలకు ఎస్‌పిహెచ్ఎస్ బాబురాజు , పీపీఎం సుధాకర్ అవగాహన కల్పించారు. గురువారం జైలర్ నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తుమ్మినపుడు, దగ్గినపుడు రక్తపు చారలు, ఉదయం సాయంత్రం జ్వరం, ఆకలి లేకపోవటం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే టీబీగా గుర్తించవచ్చున్నారు. టీబీ రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. హెచ్ఐవీ లక్షణాలు, వ్యాధి సోకకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రతలను కౌన్సిలర్ శివజ్యోతి వివరించారు.

25 నుంచి చింతలముని, నల్లారెడ్డి స్వాముల ఉత్సవాలు



తంగరడోణలో కొలువైన చింతలముని, నల్లారెడ్డి స్వామి

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు చింతలముని, నల్లారెడ్డి దశమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పార్వతి గురువారం తెలిపారు. ఆలయాలలో 25న గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు, 26న స్వాముల వారి గుర్రం ఊరేగింపు, ప్రత్యేక పూజలు, 27న ఉత్సవాలు ముగింపు కార్యక్రమం సందర్భంగా బలి దానం ఉంటుందన్నారు. స్వాములను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఆదోనిఅర్బన్ : హొళగుంద మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని గురువారం పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. బంధువులు తెలిపిన మేరకు వివరాలు.. బీఎస్సీ నర్సింగ్ ఫస్టియర్‌లో ఒక సబ్జెక్టులో ఫెయిల్ కావడంతో మనస్థాపానికి గురై సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ నిప్పంటించుకుంది. వెంటనే బంధువులు ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లాలని సూచించగా, కుటుంబ సభ్యులు బళ్లారి ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

గ్యాస్ లీకై మంటలు..

కోసిగి: మండలంలోని దుద్ది గ్రామానికి చెందిన గంగమ్మ అనే మహిళ గ్యాస్ లీక్ అయ్యి మంటలు వ్యాపించి గాయాల పాలైంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. గురువారం ఉదయం ఇంట్లో వంట చేయాలని గ్యాస్‌ను వెలిగించగా రెగ్యులేటర్ వద్ద గ్యాస్ లీకై మంటలు చెలరేగి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు


దోమల నివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న మలేరియా ఆఫీసర్, వైద్యులు

మద్దికెర : దోమలు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మలేరియా అధికారి వైద్యశాలను తనిఖీ చేశారు. అనంతరం మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో దోమలు వ్యాప్తి చెందకుండా డీడీటీ 50 % మందును ప్రతి ఇంటికీ పిచికారీ చేయించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల బారిన పడకుండా దోమతెరలు వాడాలన్నారు. దోమకాటు ప్రమాదకరమైందని, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదముందన్నారు. రోజుల తరబడి జ్వరం వుంటే వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ వైద్యసిబ్బంది వెంకటేశ్వర్లు, అక్బర్‌బాషా, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉరుకుందకు ప్రత్యేక బస్సులు

ఆదోని టౌన్: శ్రావణ మాస ఉత్సవాలను పురస్కరించుకొని ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ మహమ్మద్ రఫీక్ తెలిపారు.గురువారం ఆయన మాట్లాడుతూ..మొదటి వారంలో 10 బస్సులను తరువాత అవసరాలను బట్టి 30 నుంచి 50 బస్సుల వరకు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. కుప్పగల్ రైల్వే స్టేషన్ దగ్గర కూడా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్ చేయూతకు దరఖాస్తు చేసుకోండి

హాలహర్వి : వైఎస్సార్ చేయూతకు పథకానికి 45 సంవత్సరాలు నిండిన మహిళలు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఆంథోని సూచించారు. ఈ మేరకు గురువారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో పథకం కింద లబ్ధి పొందుతున్న మహిళలు మరలా పథకానికి అవసరమైన పత్రాలను సమర్పించి అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్ల ద్వారా ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని సచివాలయాన్ని సందర్శించాలన్నారు.

అధికార వ్యామోహంతోనే నీచ రాజకీయాలు


మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి
- చిన్నతుంబళంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


పెద్దకడబూరు/మంత్రాలయం : అధికార దాహంతోనే టీడీపీ నేత చంద్రబాబు, జనసేన నాయకుడు పవన్‌కళ్యాణ్ నీచ రాజకీయాలకు తెర తీశారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి విమర్శించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి మంజూరైన సంక్షేమ పథకాల వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచి పేరు రావడంతో చంద్రబాబు జీర్ణించుకోలేపోతున్నారన్నారు. ఆ పార్టీలకు అజెండా ఏమీ లేదని, అధికార పార్టీపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని అలజడులు సృష్టించినా, ఎన్ని కుట్రలు పన్నినా ఆ ఇద్దరినీ ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. గ్రామంలో తాగునీటి, విద్యుత్ తీగల సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అనంతరం ఉపాధి పనులకు వెళ్లి గాయపడిన ఈశ్వరమ్మ అనే మహిళకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.7,773 చెక్కును అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్ ప్రెసిడెంట్ రవీంద్ర, గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ యల్లప్ప, దొడ్డిమేకల సర్పంచు చంద్రశేఖర్, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి ఈరన్న, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ వీరేంద్రగౌడ్, ట్రాన్స్‌కో ఏఈ గోవిందు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అర్లప్ప పాల్గొన్నారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కౌతాళం: మండలంలో ఎన్నికల ప్రచారం ముగిసింది. రౌడూరులో వార్డు మెంబర్‌కు, బదినేహాల్‌లో సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. గురువారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి బదినేహాల్ గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ.. అందరం కలిసికట్టుగా బదినేహాల్ సర్పంచ్ అభ్యర్థిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. శనివారం జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీలో ఉన్న మాల పెద్ద నర్సప్పను మంచం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వీరభద్రగౌడ్, నకేష్‌రెడ్డి, రవిగౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. మారెమ్మ గుడి ఏరియాలో వర్షపునీరుతో కష్టంగా ఉందని డ్రైనేజీ తీయించాలని, శ్మశానవాటికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని, సిమెంటు రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణరాజు, మాజీ అధ్యక్షుడు వీరసేనరెడ్డి, మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, ఎంపీపీ అమరేష్, కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, ఉప సర్పంచ్ ప్రసన్నగౌడ్, సీనియర్ నాయకుడు లక్ష్మిరెడ్డి, ఏకాంబర్‌రెడ్డి, గుడిసె శివన్న, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీలు పాల్గొన్నారు.

'నాడు - నేడు' పనుల పరిశీలన


గుడేకల్ జెడ్పీ హైస్కూల్‌లో పనులను పరిశీలిస్తున్న డీఈఓ రంగారెడ్డి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్, ఎర్రకోట, కోటేకల్ గ్రామాల్లో జిల్లా పరిషత్ పాఠశాలల్లో 'మనబడి నాడు–నేడు' కింద చేపట్టిన భవన నిర్మాణాలను గురువారం డీఈఓ రంగారెడ్డి పరిశీలించారు. భవన నిర్మాణాలు ఆలస్యం కావడానికి గల కారణాలను ఉపాధ్యాయులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. డీఈఓ మాట్లాడుతూ పాఠశాల గదుల నిర్మాణాలు త్వరితిగతిగా పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు. నిర్మాణాల్లో ఏమైన సమస్యలంటే తమ దృష్టికి తీసుకువస్తే ఇదే విషయం జిల్లా కలెక్టర్‌కు తెలియజేసి పరిష్కరిస్తామని చెప్పారు.

పొలం గట్టు విషయంలో ఘర్షణ

- మధ్యవర్తి ఉప సర్పంచ్ భర్త వెంకటేష్‌కు తీవ్ర గాయాలు


గాయపడిన వెంకటేష్

తుగ్గలి : పొలం గట్టు విషయమై సర్ది చెప్పేందుకు వెళ్లిన శభాష్‌పురం ఉప సర్పంచ్ నారాయణమ్మ భర్త ఇంద్రంపల్లి వెంకటేష్ రాళ్ల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. బాధిత వర్గీయులు తెలిపిన వివరాల మేరకు.. పీసీకొండకు చెందిన చెన్నయ్య, పందికోన కృష్ణమూర్తి అలియాస్ కిట్టు గురువారం పొలం గట్టు విషయమై వాగ్వివాదానికి దిగారు. మాటా మాటా పెరిగి గొడవకు దారి తీసింది. గొడవ పడకుండా సమస్య పరిష్కరించుకోవాలని సర్దిచెప్పేందుకు వెళ్లిన వెంకటేష్‌పై శభాష్‌పురం నుంచి వచ్చిన టీడీపీ నాయకుడు ఆదినారాయణ తన మనుషులతో కలిసి రాళ్లతో దాడి చేసినట్లు ఆరోపించారు. దాడిలో మధ్యవర్తి వెంకటేష్ తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితున్ని చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. దాడికి సంబంధించి కృష్ణమూర్తి, ఆదినారాయణతో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు జొన్నగిరి ఎస్ఐ రామాంజినేయులు తెలిపారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

ఆలూరు రూరల్: విద్యుత్ వినియోగదారులు బిల్లులను సకాలంలో చెల్లించాలని ఆలూరు విద్యుత్ ఏఈ లోకేష్ సూచించారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గడువు లోగా విద్యుత్ బిల్లును చెల్లించి సంస్థకు సహకరించాలన్నారు. అలాగే పెండింగ్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సంబంధిత లైన్‌మెన్ లేదా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వ్యవసాయ బోరు కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ట్రాన్స్‌ఫార్మర్లను సీనియారిటీ ప్రకారం అందిస్తామని, రైతులు దళారులను ఆశ్రయించవద్దని సూచించారు.

విద్యార్థినికి అభినందన

కౌతాళం: స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థిని కవిత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా రాష్ట్రస్థాయి పేరేడ్‌లో పాల్గొని ప్రతిభ చూపడంతో ప్రిన్సిపాల్ పుష్పలత గురువారం అభినందించారు. ఆమె మాట్లాడుతూ తమ విద్యార్థిని మంగళవారం విజయవాడలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో పాఠశాలకు చెందిన 10వ తరగతి చదువుతున్న కవిత బాలికల బృందం మార్చ్ ఫాస్ట్ పెరేడ్ కార్యక్రమంలో పాల్గొని రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచిందన్నారు.